ఆమె ఎవరో కాదు... మధ్యాహ్నం ప్రధాని చెయ్యి పట్టుకొని కొండ చివరకు తీసుకెళ్ళి 'గ్రామ స్వరూపా'న్ని చూపించిన ఆ వూరి ప్రెసిడెంట్ కూతురు.

ఆ సమయంలో ఆమె వూరి చివరున్న మల్లికార్జున స్వామి ఆలయంకి బయలుదేరింది. చేతిలో పూలసజ్జ...

ప్రధానిని చూస్తేనే పరిస్థితి గ్రహించిందామె. తన మెదడుకు పదును పెట్టింది వెంటనే. చుట్టూ ఎక్కడా నీళ్ళు లేవు. ఇంకొద్దిక్షణాల్లో ఎక్కిళ్ళు ఎక్కువయ్యి ప్రధాని ప్రాణానికే ప్రమాదం కావచ్చు. ఎలా?

సరిగ్గా అప్పుడు మెరిసిందో ఆలోచన ఫ్లాష్‌లా ఆమె మెదడులో.

అంతే! మరుక్షణం ఆమె మెరుపువేగంతో కదలడం, కదుల్తూనే తాను దేవుడు పూజకోసమని తీసుకొచ్చిన పూలసజ్జలోంచి కొబ్బరికాయని బయటికి తీయడం, తీస్తూనే దానిని కారు బాయ్‌నెట్ మీద బలంగా కొట్టడం, మరుక్షణం కొబ్బరికాయ రెండుగా విచ్చుకోవడం, చిప్పలు రెండుగా విడివిడవకముందే ఆమె చేతులు వేగంగా కదలడం, ఫలితం ఆ కొబ్బరినీళ్ళని దోసిళ్ళతో పట్టడం, వెంటనే నీళ్ళతో నిండిన ఆ చేతులు ప్రధాని నోటి దగ్గరకు వెళ్ళడం, ఆ కొబ్బరినీళ్ళని ప్రధాని ఒక్క గుక్కకూడా మిగల్చకుండా ఆబగా తాగేయడం ఒకదాని వెంట ఒకటి చకచకా జరిగిపోయ్యాయ్.

చుట్టూ సెక్యూరిటీ సిబ్బందీ, కేంద్రమంత్రులూ బొమ్మల్లా అలాగే నిలబడిపోయారు.

ఒకటి.

రెండు... క్షణాలు కదులుతున్నాయ్... ఉద్రిక్తతని నింపుతూ.

మంచినీళ్ళు త్రాగి, స్థిమితపడ్డ ప్రధాని అడిగాడు.

"ఆ కొబ్బరికాయ దేవుడు కోసం కదా! మరి నాకెందుకు ఇచ్చావ్?"

"దేవుడు ఎక్కడో లేడు. అన్యాయాల్ని అరికట్టి, దోషుల్ని శిక్షించే ప్రతి మనిషిలోనూ వున్నాడు ప్రైమ్‌మినిస్టర్... అందుకే మీకిచ్చాను..."

విభ్రాంతిగా చూశాడు మహంతి. పద్దెనిమిదేళ్ళకే ఈ పిల్లలో ఇంత 'మెచ్యూరిటీ' వుందంటే, భవిష్యత్తులో ఈ పిల్ల ఏ ఫ్లారెన్స్ నైటింగేలో, మదర్ థెరిస్సానో అయినా ఆశ్చర్యం లేదు.

"అవునూ! మీ నాన్న అన్యాయాన్ని నీవే ఇలా బయట పెట్టావ్ కదా! రేపు నిన్ను ఇంట్లోకి నిస్తాడా?"

"రానివ్వకపోతే పోనీ! హాయిగా హరిజనవాడలోనే చదువుకుంటాను. అసలు మా నాన్నలాంటి వుండటం నాకే ఇష్టంలేదు. పులి చంపిన లేడి టికి పులుముకోలేను...

వటుడింతై అన్నట్టూ క్షణ క్షణానికి ఆమె వ్యక్తిత్వాన్ని అలాగే విభ్రాంతిగా చూస్తూండిపోయాడు ఇరవయ్యేనిమిదేళ్ళ మహంతి.

ఆమెలో ఓ తల్లి, చెల్లి, ప్రేయసి, భార్య, నెచ్చెలి మిళితమై వుండటం అతను చూశాడు. ఆమె పక్కనుంటే సర్వప్రపంచాన్ని తన కాళ్ళక్రిందికి తెచ్చుకోగలననిపించింది ఆ క్షణాన. ఎడారిలాంటి తన బ్రతుక్కి ఆమె 'ఒయాసిస్' అయితే?

ఫలితం... మరుక్షణం అతని నోటివెంట మూడే మూడు పదాలు బులెట్స్‌లా దూసుకొచ్చాయి.

"నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అని.

అప్పుడు అక్కడున్న కేంద్రమంత్రులు, సెక్రేటరీలు, సెక్యూరిటీ సిబ్బందీ నివ్వెరపోయారు... అతని మాటలకు. ప్రధాని అంతటివాడు ఓ పల్లెటూరి పిల్లను పెళ్ళి చేసుకోమని అభ్యర్థించడమా? నిజానికి అతడు కోరుకుంటే బ్రిటిష్ రాణీ తన మనమరాలిని సంతోషంగా ఇస్తుంది. అతడు "ఊ" అంటే అమెరికా ప్రెసిడెంట్ తన ముద్దుల కూతురిని కోట్ల డాలర్ల కట్నంతో ముట్టచెప్పగలడు. అతడు ఒప్పుకుంటే రష్యా ప్రధాని తన చెల్లెలుని మొత్తం సైన్యంతో ధారాదత్తం చేయగలడు.

అంతా నిశ్చేష్టతలో మునిగివుండగానే, ఆమె గులాబీరంగు పెదాలు కదిలాయ్.

"దేవుడు వరమిస్తానంటే, భక్తురాలు కాదంటుందా ప్రభూ?"

మరుక్షణం ఓ ఉద్వేగకిరణం మహంతిని ఉవ్వెత్తున ఊపింది. ఓ అనురాగకిరణం అతడిని రాగరంజితుడిని చేసింది. తన చేతిని ఆమెకు అందించి, కారులో కూర్చుండబెడుతూ అడిగాడు.

"నీ పేరు ఏమిటి?"

అప్పుడు అక్కడ గాలి స్తంభించిపోయింది. చెట్లు, పుట్టలు కదలడం ఆగిపోయాయ్ ఆమె చెప్పేది వినడంకోసం. చుట్టూవున్న కేంద్రమంత్రులు, సెక్యూరిటీ సిబ్బందీ చెవులు రిక్కించారు.

ఆమె నోట్లోంచి పదాలు గాలిలో అలలు అలలుగా తేలుతూ అక్కడున్నవారి చెవులను తాకాయి.

## "మనస్వేత"

తూర్పు పడమరని కలిపేసినట్లున్న ఆ తారురోడ్డు మీద ప్రధానికారు సాఫీగా దూసుకుపోతోంది... న్యూఢిల్లీ వేపు.

(వచ్చేవారం ప్రేలే 'డైనమైట్' కోసం చూడండి)

## మినీకథ

### తారామణి



ఒక పత్రికా విలేకరి తారామణితో జరిపిన ఇంటర్వ్యూ.

"తమరి పేరు?"

"అంజలి"

"ఇంటిపేరు"

"సుమాంజలి"

"వయసు......?"

"మా అమ్మగారు 18 అంటారు. కానీ నేను అబద్ధం ఎందుకు చెప్పాలి! నాకు 16 సంవత్సరాలు, నేను చదువుమానేసే సరికి,"

"చదువు ఎప్పుడు మానేశారు?"

"సినిమాల్లో చేరినప్పుడు!"

"సినిమాల్లో ఎప్పుడు చేరారు?"

"చదువు మానేశాక..."

"మీరు శాఖాహారాలా? మాంసాహారాలా?"

"ఇలాంటి పెద్ద విషయాలు నాకు తెలియవండీ..."

"మీరు వివాహితులా?"

"అప్పుడప్పుడు..."

పి.సునీల్.

## నీళ్ళొచ్చాయి

ప్రయాణం చేస్తున్న అప్పకొండ టి.సి.ని చూసి కంగారుపడ్డాడు.

"టిక్కెట్టేది?" అడిగాడు టి.సి.

"పర్సులో పెట్టానండి... ఇందాక బాత్రూంలోకి వెడితే పర్సు క్రింద పడిపోయింది."

"మరి గొలుసు లాగలేకపోయారా?" అడిగాడు టి.సి.

"లాగానండి... రైలు ఆగలేదు సరికదా లాగినప్పుడల్లా జొయ్యిమని బోలెడు నీళ్ళొస్తున్నాయి" అయోమయంగా చెప్పాడు అప్పకొండ.

రాజా రవీంద్ర, పాలకొల్లు.